ప్రజాశక్తి
సోమవారం 18 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి

పకడ్బందీగా 'పది' పరీక్షలు : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఇఒ మీనాక్షి పదవ తరగతి పరీక్షల సన్నద్ధత గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరిగే పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 115 పరీక్ష కేంద్రాలలో 27,555 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాబోతున్నారన్నారు. ప్రశ్నాపత్రాలలో ప్రతి పేజీలను ప్రత్యేకంగా తొలిసారిగా యూనిక్ క్యూఆర్ కోడ్ నిక్షిప్తమై ఉంటుందని ఎవరైనా విద్యార్థి ప్రశ్న పత్రాన్ని లీక్ చేస్తే వెంటనే అది ఏ అభ్యర్థి ఏ పరీక్ష కేంద్రం నుంచి బయటపడిందో తెలుస్తుందన్నారు. పరీక్ష కేంద్రాలను మొబైల్ ఫ్రీ జోన్ ప్రకటించామని కాబట్టి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు గాని పరీక్ష నిర్వహణ విధులు నిర్వహించేవారు కానీ ఎటువంటి మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ వస్తువులు కాని తీసుకెళ్లకూడదన్నారు. ఈ పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రసార మాధ్యమాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

శాస్త్రీయ ఆలోచనలను పెంచుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆధునిక ప్రపంచంలో సమాజం సమస్యలపై శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న కళ్యాణ మండ పంలో ఆదివారం సిఐటియు అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఇంతియాజ్, సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు మాట్లాడుతూ కదిరిలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కరోనా సమయంలో విశిష్ట సేవలు అందించిన ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని విమర్శించారు. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని, విధి నిర్వహణలో తమ వంతు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ సౌభాగ్య, సాంబశివ, జగన్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

జేసీ హామీతో ఆందోళన విరమణ

ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న శ్రీకంఠాపురం వాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని శ్రీకంఠపురం ప్రాంతంలో 20 రోజుల నుంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు విన్నవించినప్పటికి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ ప్రాంత మహిళలు హిందూపురం–లేపాక్షి ప్రధాన రహదారిపై ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించారు. సుమారు రెండు గంటల పాటు మండుటెండను కూడా లెక్క చేయకుండా మహిళలు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వేసవి ఆరంభంలోనే తాగునీటి సమస్య నెలకొందని అన్నారు. బోర్లు చెడిపోయాయనివాటిని రిపేరు చేయించేందుకు సైతం నిధులు లేవని మున్సిపల్ అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ సంపాదనలో రోజుకు రూ.50 వరకు నీటి కోసం వెచ్చించాల్సి వస్తోందన్నారు. గతంలో రూ.194 కోట్లతో గొల్లపల్లి నుంచి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా వస్తున్న నీరు ఎక్కడి వెళుతున్నాయని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ సమయంలో అదే రోడ్డులో జాయింట్ కలెక్టర్ పురం పర్యటకు వచ్చారు. ఆందోళన చేస్తున్న మహిళలకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. నెల రోజులుగా ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుక్కుంటున్నామని, తమ సమస్య మున్సిపల్ అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని మహిళలు జేసీకి ఫిర్యాదు చేశారు. రెండు గంటలుగా ఆందోళన చేస్తున్నప్పటికి ఇక్కడికి మున్సిపల్ అధికారులు ఏ ఒక్కరు రాలేదన్నారు. దీంతో జాయింట్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మోటార్లు మరమ్మతు చేయించే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. జాయింట్ కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లగానే మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తో పాటు నీటి విభాగం అధికారులు అక్కడికి చేరుకుని ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే మోటార్లను మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

బాధితులతో మాట్లాడుతున్న జేసీ

నాడు ప్రత్యర్థులు.. నేడు 'కూటమి' మిత్రులు

రసవత్తరంగా రాయదుర్గం రాజకీయాలు

'కాలవ'కు 'కాపు' సహకరించేనా..?

ప్రజాశక్తి - రాయదుర్గం

రాజకీయాల్లో శాశ్వత శతృత్వం కాని, మిత్రుత్వం కాని ఉండదంటారు. అందుకు సరిగ్గా రాయదుర్గం రాజకీయాలు సరిపోలాయి. రెండు నెలల క్రితం వరకు మాజీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ప్రస్తుత ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రాజకీయ ప్రత్యర్థులు. ఒకరు టిడిపికి చెందిన వారు కాగా, మరొకరులు వైసిపికి చెందిన వారుగా ఉండేవారు. వైసిపి తరుపున ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా కొనసాగిన కాపు రామచంద్రారెడ్డి ఇదివరకు దాదాపు ప్రతినిత్యం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును విమర్శించని రోజు ఉండేది కాదు. ఆయన కూడా అంతేస్థాయిలో కాపు రామచంద్రారెడ్డిపై విమర్శలు చేసేవారు. ఎప్పుడైతే వైసిపి తరపున కాపు రామచంద్రారెడ్డికికి టికెట్ ఇవ్వడం లేదని తెలిసిందో ఆ రోజే ఆయన ఆ పార్టీకి గుడ్‌బై కొట్టేశారు. రాయదుర్గం,కళ్యాణదుర్గం తనకు రెండు కళ్లు అనిఈ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తాను, తన కుటుంబ సభ్యులు, మిత్రులు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఇండిపెండెంట్‌గా లేదా పార్టీల తరపున పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు. పార్టీ టికెట్లపై శతవిధాల ప్రయత్నించారు. కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి, షర్మిలను కలిశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బిజెపి నాయకులు జెపి నడ్డా, పురందరేశ్వరిని కలిశారు. ఈ నేపథ్యంలో కాపు శనివారం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఇటు అసెంబ్లీ అటు లోకసభ ఎన్నికలలో 'కాపు' పోటీ చేసే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంలో అసెంబ్లీ, లోకసభ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పొత్తు పెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఈ కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులకు ఈ మూడు పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలపాల్సిన అవసరం ఉంది. ఈ కూటమి తరపున రాయదుర్గం నుండి అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఎన్నికల బరిలో ఉన్నారు. రాయదుర్గం ప్రాంతానికి చెందిన కాపు రామచంద్రారెడ్డికి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో మిత్రపక్షం అభ్యర్థి కాలవ శ్రీనివాసులును గెలిపించాల్సిన బాధ్యత ఉంది. గతంలో నిత్యం కాలవపై నిప్పులు చెరిగిన కాపు రామచంద్రారెడ్డి ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో ఆయనకు ఏ విధంగా మద్దతు ఇస్తారో అనిస్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాపు రామచంద్రారెడ్డి వెంట అనుచరులుగా ఉన్న అనేకమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి మెట్టు గోవింద్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అయితే వారిలో మరికొందరు ఇప్పటికీ కాపు వెన్నంటే ఉన్నారు. మరి వారంతా వైసిపికి కాకుండా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం ఉందా అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా వైసిపిదే విజయం : కేతిరెడ్డి

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయం అని ధర్మవరం వైసిపి అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్లో ఆదివారం సాయంత్రం 25,26,27,28 వార్డుల ప్రజలతో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని నాలుగు వార్డుల ఇన్చార్జు మేడాపురం సూరి, మేడాపురం వెంకటేష్, కామిరెడ్డిపల్లి సుధాకర్రెడ్డి, సరితాలభాషలు గజమాలతో సత్కరించారు. అనంతరం కేతిరెడ్డి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా కేవలం పేదవారి కోసం నిలబడిన పార్టీ వైఎస్సార్‌సీపీ పార్టీ అని అన్నారు. 18ఏళ్ల నుంచి మా నాన్న, నేను ఇక్కడే ఉండి ప్రజల కోసం పనిచేస్తున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత ప్రముఖులు కాచర్ల అంజి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, పట్టణాధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, కౌన్సిలర్లు సరితాల ఆశాబి, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, పెనుజూరు నాగరాజు,జెసిబి రమణ , నాయకులు బాంద్ బాషా, అమీర్‌బాషా, ఉడుముల రాము, చెలిమి పెద్దన్న,చింతా భాస్కర్ రెడ్డి,వంట రమేష్, కత్తి పెద్దన్న, తీర్థాల వెంకటరమణ, చందు, కేత లోకేష్, పరంధామ రెడ్డి,పెద్ది రెడ్డి గారిశ్రీనివాసులు, బాలంగోపాల్, కరీమ్, రామకృష్ణ, తోపుదుర్తి వెంకట రాముడు,దాసునాయక్, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, పురుషోత్తం, జింకా కంబగిరి, గోపన సూరి, శ్రీరాములు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట కుచ్చుటోపీ..!

నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి టోకరా

గుత్తిలో కార్యాలయం ఏర్పాటు చేసి రూ.1.60 కోట్లు వసూలు

ఎస్పీని ఆశ్రయించనున్న బాధితులు

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి గుత్తిలో రూ.కోట్లు వసూలు చేసిన దంపతులు తమ కార్యాలయ బోర్డు తిప్పేసి హైదరాబాదుకు ఉడాయించిన ఘటన అనంతపురం జిల్లా గుత్తిలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ భాగోతం గురించి బాధితులు తెలిపిన వివరాలు...

ప్రజాశక్తి గుత్తి

గుత్తి పట్టణం శివారులోని కర్నూలు రోడ్డులో గల ఓ కాలనీలో రాణి నాగేశ్వరి, సాయి దుర్గాప్రసాద్ అనే దంపతులు ఓ గది అద్దెకు తీసుకుని ఎమ్ఎస్. సొల్యూషన్స్ (జాబ్ కన్సల్టెన్సీ) పేరు మీద కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తమ ప్రధాన కార్యాలయం హైదరాబాదులో ఉందని నమ్మబలికారు. వాట్సాప్ గ్రూప్‌ను తయారు చేసి నిరుద్యోగ యువకులను ఆకర్షించేందుకు పలు కంపెనీల సంబంధించిన కార్యాలయాల వీడియోలను పోస్ట్ చేసేవారు. పలువురు ఉద్యోగాలు చేస్తున్నట్లు వీడియోలు చేసి వాట్సాప్‌లో సెండ్ చేసేవారు. నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌తో పాటు వివిధ ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించారు. ఉద్యోగాలకు అవసరమయ్యే విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను నకిలీవి వారే సృష్టించేవారు. అంతేకాకుండా వివిధ కళాశాలలకు చెందిన ఫేక్ సర్టిఫికెట్లు కూడా తయారు చేసేవారు. కొంతమంది నిరుద్యోగులతో మాట్లాడి వారి బయోడేటాను తామే కంపెనీలకు పంపించామని చెప్పేవారు. ఈ నేపథ్యంలో ఉద్యోగం వస్తుందని ఆశతో మండలంలోని చెర్లోపల్లి కాలనీ చెందిన జి.మోహన్‌కృష్ణ అనే యువకుడు వారిని ఆశ్రయించాడు. ఉద్యోగం ఇప్పిస్తామని రాణి నాగేశ్వరి, సాయి దుర్గాప్రసాద్ ఆ యువకుడిని నమ్మించారు. దీంతో మోహన్‌కృష్ణ తల్లిదండ్రులు వడ్డీకి అప్పుచేసి రూ.3.35 లక్షలు ఇచ్చారు. దీంతో మోహన్‌కృష్ణ రూ.50 వేలు ఫోన్ పే ద్వారా, రూ. లక్ష హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా వారి అకౌంట్‌కు చెల్లించాడు. మరో లక్ష రూపాయలు కార్యాలయానికి వెళ్లి ఇచ్చాడు. మిగిలిన రూ. 85వేలు ఇంటి వద్దకు వెళ్లి రాణినాగేశ్వరికి చెల్లించాడు. దీంతో ఆ యువకుడికి నకిలీ ఉద్యోగ ధ్రువీకరణ పత్రం, ఐడి కార్డు, తక్కువ ధర గల ల్యాబ్ టాప్ ను అందజేసిన ఆ దంపతులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని నమ్మించారు. వార్షిక వేతనం రూ.4.50లక్షలు అని చెప్పారు. ఐదు నెలల పాటు ఆ యువకుడిని ప్రతినెలా రూ.16వేలు చొప్పున వెబ్‌నెట్ ఇన్ఫోసెస్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరు మీదుగా ఎమ్ఎస్. సొల్యూషన్స్ నిర్వాహకులే వేతనంగా చెల్లించారు. కంపెనీకి పోయి ఉద్యోగం చేసినప్పుడు నెలకి రూ.35వేలు వేతనం వస్తుందని నమ్మించారు.



SUBMISSION OF DOCUMENTS

You are requested to submit the following documents to us immediately onreceipt of the offer:

1. Two Photocopies of your Educational Certificates (10th Passing Certificate, 12th Passing Certificate, Graduation Passing Certificate, Post-Graduation Passing Certificate)
2. Two Photocopies of your Relieving Letter from present Employer (on the day of joining)
3. Two Photocopies of the Last 3 months Salary Slip of present Employer
4. Two Photocopies of all Experience Letter from previous companies
5. Passport size photograph

Please sign and return theduplicate copy of thisletter for our records"

We wish you a long and happy association with our company.

Annexure-Compensation Details

Name : G Mohan Krishna
Role : Associate Engineer
LOCATION : Hyderabad

ELEMENTS	Amount in INR
Basic Pay	18,750.00
House Rent Allowance	9,375.00
Special Allowance	9,375.00
Transport Allowance	5,000.00
Telephone Allowance	1,000.00
Stationary Allowance	1,375.00
Medical Allowance	2,000.00
Gross Salary	37,500.00
Statutory Deductions	
PF	2,250.00
ESIC	0,00.00
Net Payable	35,250.00
Monthly Gross	37,500.00
Annual Gross	450,000.00

నకిలీ ఉద్యోగ నియామక పత్రం

అయితే ఐదు నెలలుగా ఆ యువకుడికి వేతనం రాలేదు. దీంతో ఆ యువకుడి అనుమానం వచ్చి రాణి నాగేశ్వరిని, సాయి దుర్గాప్రసాద్‌ను అడిగాడు. దీంతో వారు తమకు సంబంధం లేదని కంపెనీ వారిని అడగాలని అన్నారు. చేసేదిలేక మోహన్‌కృష్ణ వెబ్‌నెట్ ఇన్ఫోసెస్ కంపెనీ ఎక్కుడుందని ఆరా తీశాడు. సికింద్రాబాద్ శివారులో ఉందని చెప్పడంతో అక్కడి వెళ్లి ఆరా తీయగా అది ఫేక్ కంపెనీ అని తేలింది. దీంతో ఆ యువకుడు రాణినాగేశ్వరిని, సాయి దుర్గాప్రసాద్‌ను నిలదీశాడు. దీంతో వారు బేరసారాలకు దిగినట్లు తెలుస్తోంది. ఇలా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరితో రూ.2 లక్షలు నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేసుకుని నకిలీ ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు సమాచారం. ఇలాగే గుత్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు ఉద్యోగం కోసం రూ.2 లక్షల చెల్లించాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు సంబంధించి 86 మంది తమకు ఉద్యోగాలు వస్తాయని ఆశతో డబ్బు ఇచ్చి మోసపోయారు. వీరందరి వద్ద నుంచి సుమారు రూ.1.60 కోట్లు వసూలు చేసుకుని మోసం చేసినట్లు సమాచారం. ఇటీవల వీరు గుత్తిలో ఉన్న తమ కార్యాలయం బోర్డు తిప్పేశారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత యువకులు వారిని డబ్బులు చెల్లించాలని రాణి నాగేశ్వరి, సాయిదుర్గాప్రసాద్‌కు ఫోన్ చేస్తుండటంతో వారు బెదిరిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. తాము ప్రజా ప్రతినిధులతో దిగిన ఫోటోలను బాధితులకు వాట్సాప్ లో పెట్టి బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అందరూ తెలుసు అని ఏం చేసుకుంటారో చేసుకోండని ఇలా చేస్తే ఇంటికి వచ్చి చావకొడతామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. తమకు జరిగిన మోసంపై తాము పోలీసులను ఆశ్రయించనున్నట్లు బాధితులు తెలిపారు. గతంలో వీరు కర్నూలులో కూడా ఇలాగే కార్యాలయం ఏర్పాటు చేసి నిరుద్యోగులను మోసం చేసినట్లు సమాచారం.

నిరుపయోగంగా వాణిజ్య సముదాయం



నిరూపయోగంగా ఉన్న వాణిజ్య భవనం

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూ.30కోట్లతో నిర్మించిన వాణిజ్య సముదారం నిరుపయోగంగా మారింది. వాణిజ్యసముదాయ భవనం, కూరగాయాల మార్కెట్‌ను అటు పాలకులు గాని... ఇటు అధికారులు గాని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఆ మార్కెట్ నేడు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. మందుబాబులకు నిలయంగా మారింది. ఇక పాలకులు తమకు కాసులు కురిపించే వాటిపై మాత్రమే దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా వాణిజ్య సముదాయ భవనం కింద ఉన్న అండర్ గ్రౌండ్‌ను పూల వ్యాపారులకు, బస్టాండ్‌లో ఉన్న స్థలాన్ని కూరగాయాల టోకు వ్యాపారులకు పాలకులు కేటాయించి, తమ చేతులు తడుపుకున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఈ విషయాలు అధికారులకు తెలిసినా వారిపై కనీస చర్యలు సైతం తీసుకోలేదంటే అధికారులపై అధికార పార్టీ పాలకులు ఎంత ఒత్తిడి తీసుకోచ్చారో అర్థం అవుతుంది. ముందు చూపు లేకపోతే, అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయకపోతే సమాజానికి, జనానికి కలిగే నష్టాలు, కష్టాలు అపారం. ఇందుకు నిదర్శనం కళ్లెదుట కనబడే హిందూపురం పట్టణ నడిబొడ్డున రెండున్నర ఎకరాల్లో రూ.30 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన నూతన మార్కెట్. హిందూపురం పట్టణంలో వందేళ్ల క్రితం నిర్మించిన మార్కెట్ శిథిలావస్థకు చేరడం, కాలు తీసి కాలు పెట్టడానికి అవకాశం లేక అటు కొనుగోలు దారులు, ఇటు వ్యాపారులకు ఇబ్బందికరంగా ఉండటంతో అన్ని హంగులతో కూడిన నూతన మార్కెట్‌ను నిర్మించాలనేది 30 ఏళ్లుగా హిందూపురం ప్రాంత వాసుల డిమాండ్. ప్రతి ఎన్నికల్లో రాజకీయ పార్టీల వాగ్దానం అదే. అనేక అడ్డంకులను అధిగమించి, గత ప్రభుత్వ హయాంలో 2016 సంవత్సరంలో పాత మార్కెట్‌ను కూల్చి, దాని స్థానంలో రూ. 100 కోట్లతో మార్కెట్ నిర్మాణం చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అది కాక పోవడంతో రూ. 23 కోట్లతో నూతన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. నిర్మాణ పనులకు చంద్రబాబు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేయగా, మిగిలిన సొమ్మును గదులు వ్యాపారులకు కేటాయించి, వారి నుంచి వచ్చే గుడ్‌విల్‌ను నిర్మాణపనులకు వినియోగించాలని నిర్ణయించారు. అయితే మార్కెట్ ప్రాంతంలో ప్రార్థనా మందిరాలకు స్థలాలను ఇవ్వాల్సి రావడం తదితర సమస్యలతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. దీంతో పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాక పోయినప్పటికి 2019లో ఎన్నికలు సమీపించడంతో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ మార్కెట్ ను ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు రెండు సంవత్సరాలు మార్కెట్ గురించి ఎవరు పట్టించు కోలేదు. మున్సిపల్ కమిషనర్ గా భాగ్యలక్ష్మి భాధ్యతలను స్వీకరించిన సమయంలో కాస్తా పనులు జరిగాయి. అనంతరం కమిషనర్‌గా వెంకటేశ్వర రావు భాధ్యతలను స్వీకరించిన అనంతరం మార్కెట్ పై ప్రత్యేక దృష్టి సారించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి, బహిరంగ వేలం నిర్వహించి, పురపాలిక ఆదాయాన్ని పెంచారు. అయితే మార్కెట్, వాణిజ్య భవనాల్లో బహిరంగ వేలం ద్వారా తీసుకున్న గదుల్లో ఇంకా వ్యాపారాలు ప్రారంభం కాలేదు. కొంత మంది రోడ్డు పక్కన తీసుకున్న వారు గదిలో కాకుండా వరండాలో వ్యాపారాలు చేయడం వల్ల లోపల గదుల్లో వ్యాపారాలు జరగక పోవడంతో వారందరు తమకు అద్దె సైతం గిట్టుబాటు కావడం లేదని మూసి వేశారు.

రాజకీయ ప్రకటనలను తొలగించాలి

కలెక్టర్ అరుణ్ బాబు



విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని అనుమతి లేని రాజకీయ ప్రకటనలను వెంటనే తొలగించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమాలను పటిష్టంగా అమలుపరిచేందుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి 24 గంటలలో ప్రభుత్వ కార్యాలయాలు బహిరంగ, ప్రయివేటు స్థలాల్లో అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు నియోజకవర్గాల వారీగా ఎన్నికల నియమావళి గురించి సమీక్షించారు. ప్రత్యేక టీంలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలన్నారు. ఏ కార్యాలయాల పైన రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫోటోలను, జెండాలను ఉంచరాదన్నారు. బస్టాండ్ు రైల్వే స్టేషన్లలో రోడ్డుకు ఇరువైపులా మీటింగ్ ప్రాంతాలలో అన్ని హోర్డింగ్‌లను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత ఏఆర్వోలతో ఎంపీడీవోలతో మాట్లాడాలన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా అదే రోజు నివేదికలు అందించాలన్నారు. వాలంటీర్లు ఎక్కడైనా రాజకీయ పార్టీల కార్యక్రమాలలో పాల్గొంటే వారిని సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పుట్టపర్తి భాగ్యరేఖ, మడకశిర గౌరీ శంకర్, కదిరి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

19న అంకురార్పణతో ప్రారంభం : ఇఒ

ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ ముగుస్తాయి. పాల్గుణ మాసంలో పక్షం రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలను బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. 15 రోజులూ శ్రీవారు రోజుకో అవతారంలో ఒక వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన మిస్తారు. నరసింహ స్వామి క్షేత్రాల్లో ఒకటైన కదిరి లక్ష్మీనరసింహస్వామికి ఎంతో విశిష్టత ఉంది. బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో మొదలై తీర్థవాదితో ముగుస్తాయి. 19వ తేదీ అంకురార్పణ, 20న కళ్యాణోత్సవం, 21న హంస వాహనం, 22న సింహవాహనం, 23న హనుమద్ వాహనం, 24న బ్రహ్మగరుడ సేవ, 25న శేష వాహనం, 26న సూర్య, చంద్రప్రభలు, 27న మోహిని ఉత్సవం, 28న ప్రజాగరుడ సేవ, 29న గజవాహనం, 30న తేదీ బ్రహ్మోత్సవం, 31న అలకోత్సవం, ఏప్రిల్ 1వ తేదీ తీర్థవాది, 2న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ దేవాదాయ ఉప కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి యశోదమ్మ

కందికుంట యశోదమ్మ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-కదిరి టౌన్

నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట యశోదదేవి ప్రచారానికి వెళ్లిన ప్రతిచోటా విశేష స్పందన లభిస్తోంది. ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఆమె నెల రోజుల నుంచి పట్టణంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ప్రతి వార్డులో ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో కూటమి (టిడిపి, జనసేన, బిజెపి) అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరుతున్నారు. యశోద దేవి ఏ వార్డుకు వెళ్లినా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. వైద్యశాలల్లో వైసిపి ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా ఇబ్బందులకు గురి చేసిం దో, సామాన్యులపై మోయలేని భారాలు వేసిందో వివరించారు. ఆదివారం పట్టణంలోని 15వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీడీ కార్మికులు ఆమెకు సమస్యలను వివరించారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాబ్‌జాన్, హైదర్‌వలీ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సురయాబాను, జావీద్, బోబీ, హరి, అలీ, ఖాజా, కౌన్సిలర్ మహబూబ్‌బాషా, అఫ్జల్‌అలీ, బైల్ మాబాషా, ఖలీల్, పరువుల బాబ్‌జాన్, ఇమామలు, అయూబ్ అలీఖాన్, గోపాల్, అస్గర్, విశ్వనాథ్, సి.ఎ.ఫారూఖ్, సలాం, బీడీ ఇస్మాయిల్, నాసిర్, కౌన్సిలర్ ముస్తఫా, కుటాగుల్ల శంకర్, నాగన్న, రమణ, పర్వీన్‌బాను, కొమ్మినేని కల్యాణ్‌చౌదరి, అరుణ, గంగాధర్లు, ఫరీదా, జెఎస్ మన్సూర్, ఆన్వర్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : పట్టణంలోని 10వ వార్డుకు చెందిన మైనార్టీ యువ నాయకుడు సయ్యద్ సాదిక్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు వైసిపిని వీడి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి యశోదమ్మ సమక్షంలో టిడిపిలో చేరారు. బాబ్‌జాన్, అల్లాబకాష్, రఫీక్, సయ్యద్‌బాషా, సునార్ సబ్జాన్, రహంతుల్లాహ్, దానిష్, మెహిదీన్‌లకు యశోదమ్మ పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన లచ్చమ్మ కుమారుడు భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్ భాస్కర్ కుటుంబానికి వారి తండ్రి మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ చేత రూ. 10వేలు అందించారు.

నవీన్‌నిశ్చల్‌కు వేణురెడ్డి శుభాకాంక్షలు

హిందూపురం : వైసిపి జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన నవీన్‌నిశ్చల్‌ను ఆదివారం వైసిపి నాయకులు వేణురెడ్డి నవీన్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. తన రాజకీయ గురువు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికవ్వడం సంతోషంగా ఉందని వేణురెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరం

హిందూపురం : ఆత్మరక్షణ విద్య నేడు అందరికీ అవసరమని ఎస్ గౌజు ర్యూ కరాటే ఆల్ ఇండియా చీఫ్ క్యోషి అల్లాఫ్‌పాషా పేర్కొన్నారు. పట్టణంలోని ఢిల్లీ పాఠశాలలో ఆదివారం కరాటే మాస్టర్ సెన్సెయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులకు బెల్ట్ ఎక్జామ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు వివిధ బెల్టులు బహూకరించి అభినందించారు.

పేద కుటుంబానికి 'తారక్' ట్రస్ట్ చేయూత

ధర్మవరం టౌన్ : అనంతపురం నగరానికి చెందిన అంజి జలీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పట్టణంలోని తారక్ చేయూత ట్రస్ట్ వ్యవస్థాపకులు రామాంజి ఆదివారం తన బృందంతో కలిసి అనంతపురం వెళ్లి ఆ కుటుంబానికి 3 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

కళ్యాణ మండపానికి విరాళం

మడకశిర : రొళ్ల మండలంలోని కాల్వేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న లక్ష్మీరంగనాథస్వామి కళ్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం మడకశిర పట్టణానికి చెందిన దాత రూ. 32 వేలు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ సొమ్ముతో 4 వేల ఇటుకలు కొనుగోలు చేస్తామని కమిటీ సభ్యులు రాజన్న, శ్రీరంగప్ప, తిమ్మప్ప, రమేష్, కాంతరాజు తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కదిరి టౌన్ : మహిళా దినోత్సవం పురస్కరించుకొని శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం కదిరి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో మహిళలను ఘనంగా సన్మానించారు. సామాజిక అంశాల్లో సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన బలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళలు ధృవం చెన్నమ్మ, అన్నం శాంతమ్మ, చింతా సరస్వతి, పూల కుసుమకుమారి, మిడతల వెంకటలక్ష్మి, మోక కృష్ణవేణి, గాజుల సత్యవతి, మాసగాని ప్రసన్నలక్ష్మి, కాశర్ల శ్రీవాణి, అన్నం జయలక్ష్మితో పాటు కుల పెద్దలు అంగజాల ఈశ్వరయ్య, పూల అశ్వర్థనారాయణ, మిండల వెంకటరమణ, తీపుపల్లి వెంకటాచలపతి, పిడుగు నరసింహులు, కుటాల శ్రీరాములు, చిన్నకోట్ల తిరుపాలు, ఆనంద అంజనప్ప, అడుసుకోట సత్యం, పూల ఉత్తన్న, బాలప్పగారి గంగులప్ప, పూల సుబ్బరామయ్య, గడ్డం ఆదినారాయణ తదితరులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చింతకుంట రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ధృవం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు బైరిశెట్టి, సుంకర రవి, మోకా హరిమోహన్, అన్నం జనార్దన, పలసాని ఉత్తన్న, గాజుల సోమశేఖర్, అడుసు శివశంకర్, షిర్డి సాయి సురేష్‌కుమార్, కమ్మల బాలాజీ, కుటాల లక్ష్మణ, పూల నారాయణ, పులగంటి నారాయణ, ధృవం సుధాకర్, కొత్త రమేష్, కనిగొండ నరేష్, బాసింగాల రాజశేఖర్ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : పట్టణానికి చెందిన డిష్ చంద్ర ఆధ్వర్యంలో 3, 35 వార్డుల నుంచి బిజెపికి చెందిన 80 మంది ఆదివారం వైసిపిలో చేరారు. వారికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ పార్టీ కండువా వేసి వైసిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడు తూ వైసిపి సంక్షేమం, అభివృద్ధితో పాటు సామాజిక న్యాయం పాటిస్తుందని, దీంతో వైసిపిలో చేరామన్నారు. వైసిపి గెలుపు కోసం పనిచేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు : డిఇఒ

ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌కు సూచనలు చేస్తున్న డిఇఒ మీనాక్షి

ప్రజాశక్తి-కొత్తచెరువు :

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిఇఒ మీనాక్షి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నందున ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఆర్‌జెడి రాఘవరెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో డివైఇఒ రంగస్వామి, వృత్తి విద్య జిల్లా కోఆర్డినేటర్ లాజర్, ఎడిలు నాగరాజు, రామకృష్ణ, ఎంఇఒలు పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ఎంఇఒలు రొళ్ల జడ్పీ హెచ్‌ఎస్, రొళ్ల కెజిబివి పరీక్ష కేంద్రాలకు ఎంపికైన ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లతో సమావేశమై సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇన్విజిలేటర్లు సమయపాలన పాటించాలన్నారు. మాస్‌కాపీయింగ్, చీటీలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఇఒ ఎస్‌ఎన్.శ్రీధర్, జడ్పీహెచ్‌ఎస్ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సునీత, కెజిబివి చీఫ్ సూపరింటెండెంట్ తిప్పమ్మ, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, రెండు పరీక్ష కేంద్రాల ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ రమణప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో 790 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా కేంద్రా లకు ముందుగానే చేరుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్యం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల ఆవరణం, సమీపంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ కేంద్రాల్లో గాని, ఎన్నికల విధుల్లో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ స్టాటిక్ సర్వే లైన్స్, వీడియో సర్వే లెన్స్ సంబంధించిన వారు పకడ్బందీగా విధులు నిర్వర్తిస్తూ, ఎన్నికల నియమ నిబంధనలను తప్పక పాటించాలని ఆర్‌డిఒ వెంకట శివరామిరెడ్డి ఆదేశించారు. ఆర్‌డిఒ ఆదివారం వారితో అత్యవసర సమావేశం నిర్వహించి 17వ తేదీ నుంచే తమ విధులను కొనసాగించాల ని ఆదేశించారు. వాహనాలను తనిఖీలు చేస్తూ నగదు బయటపడితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్న 36 మంది ఎన్నికలు సజావుగా నడిచేలా సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే కాల్ సెంటర్ నెంబర్ 1950కు తెలపాలన్నారు. యాప్ సవిధ, సి.విజర్ యాప్‌లను కూడా ఉపయోగించుకొని ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో ఎఒ రమేష్‌బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ షణ్ముఖ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో అత్యవసర సమావేశం

పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ వెంకటశివరామిరెడ్డి రాజకీయ పార్టీల నాయకుల తో అత్యవసర సమావేశం నిర్వహించారు. వారు ఎన్నికల్లో పాటించాల్సిన విధి విధానాలు, తీసుకోవా ల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. ఎన్నికల కోడ్ ఉన్నందున ఇళ్ల వద్ద, వాణిజ్య సముదాయాల వద్ద పార్టీలకు సంబంధించిన ప్రచార సాధనాలను, గోడలపై పార్టీకి సంబంధించిన ప్రకటనలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల్ కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించా రు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల సంఘం విధి విధానాలను తూచా తప్పక పాటిస్తూ, ఎన్నికలు విజయవంతం అయ్యేలా సహకరించాలని తెలిపారు. సమావేశంలో కమిషనర్ రామ్‌కుమార్, ఎఒ రమేష్ బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ షణ్ముఖ యాదవ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయపార్టీల ఫ్లెక్సీలు, గోడ రాతలు ఉండరాదు : మున్సిపల్ కమిషనర్

కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన ఎన్నికల విధి విధానాలను అందరూ విధిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్ల రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, గోడలపై రాతలను తొలగించామన్నారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు తాత్కాలికంగా ముసుగు వేశామన్నారు. ఎన్నికల విధి విధానాలపై సంబంధిత అధికారులు, సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహించి, ఎన్నికలు విజయవంతం అయ్యేలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎన్నికలకు సంబంధించి అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చన్నారు. వార్డుల్లో రాజకీయపార్టీల ఫ్లెక్సీలు, గోడ రాతలు ఉండరాదని కౌన్సిలర్లకు సూచించామన్నారు. పట్టణ ప్రజలతో పాటు, కౌన్సిలర్లు, పార్టీల ప్రతినిధులు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆయనతో పాటు మేనేజర్ ఆనంద్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ ఎంపి టికెట్ కోసం సమద్ షాహీన్ ప్రయత్నాలు

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయడానికి స్థానిక సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత బిఎ సమద్ షాహీన్ తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నా రు. ఈయన 1983–84లో పట్టణంలోని ఎస్బిఐ కళాశాలలో ఎన్‌ఎస్‌యుఐలో పని చేసి, కళాశాలలో కామర్స్ విభా గంలో అవసరమైన వసతుల కోసం ఉద్యమాలు చేశారు. యువజన కాంగ్రెస్ విభాగంలో వివిధ పదవులు చేపట్టారు. ఆయన తండ్రి బిఎ బషీర్ సాబ్ దాదా 40 ఏళ్లు కాంగ్రెస్‌లో ముఖ్య నాయకుడిగా గుర్తింపు పొందాడు. చిన్నాన్న జబ్బార్ సాబ్ సైతం కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నాయకుడిగా పని చేశారు. 1933లో మార్కెట్ యార్డు చైర్మన్ చేశారు. షాహీన్ పెద నాన్న వహీద్‌సాబ్ 1952–57లో హిందూపురం మున్సిపల్ చైర్మన్‌గా పని చేశా రు. 1977లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హిందూపురం పర్యటనకు వచ్చిన సమయంలో వీరి ఇంటికి వెళ్లారు. 2004, 2009లో ఎంపి టికెట్ ఆశించి దక్కలేదు. అయినా పార్టీ అభివృద్ధి కోసం, పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. తాజాగా 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని ఇప్పటికే పార్టీ అధ్యక్షురాలు షర్మిళను కలిసి వ్యక్తిగత సమాచారం అందించారు. పరిశీలించి న్యాయం చేస్తామని అధిష్టానం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎంపి స్థానానికి కదిరి ప్రాంతానికి చెందిన లయన్ ఖాసీం ఖాన్, ఇదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరితో పాటు హిందూపురం పట్టణానికి చెందిన మరో ఇద్దరు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

అవకాశం ఇస్తే బరిలో ఉంటా : సమద్ షాహీన్

తమ కుటుంబంతో పాటు తాను విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశా. 2009లో ప్రాంతీయ సమీకరణలో భాగంగా వేరే వారికి అవకాశం కల్పించారు. ఈసారి తనకు అధిష్టానం అవకాశం కల్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే ఈరన్న సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : మండలంలోని చందకచర్ల గ్రామపంచాయతీ ఎగువ అచ్చంపల్లి, మరువపల్లి గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు కోటినాయక్, లక్ష్మీనాయక్, రాజునాయక్, శ్రీరామనాయక్, యల్లప్పతో పాటు 10 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే ఈరన్న సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, బొజ్జప్ప, ఆదినారాయణ, చందకచర్ల సర్పంచి దేవ్లానాయక్, రామాంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్, క్రిష్టప్ప, గురుసిద్ధప్ప, మల్లేశప్ప, శేషాద్రి, రాంభూపాల్‌రెడ్డి, రమేష్, మూర్తినాయక్, ప్రకాష్‌నాయక్, గంగాధర్, వెంకటేష్, గోపీనాయక్, కోట్ల రంగనాథ్, నరేష్, నాగరాజు, చిన్న చెన్నయ్య, అంజనప్ప, శ్రీనివాసులు, నాగరాజు, కరియన్న, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టిడిపి అభ్యర్థి సవితమ్మ

వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలుకుదామని కూటమి అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె ఆదివారం మండలంలోని అడదాకులపల్లి, మావటూరు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకుగ్యారెంటీ, మినీమేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సవితమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగించిందన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే టిడిపితోనే సాధ్యం అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దండు మమత ప్రసాద్, నాయకులు రంగనాయకులు, ఆంజనేయులు, ఉపేంద్ర నాయక్, బాలాజీనాయక్, మావటూరు గోపాల్, టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగింపు.. విగ్రహాలకు ముసుగు

కొత్తచెరువు : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలను మేజర్ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రధాన కూడలిలో రాజకీయ పార్టీల జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తీసి వేశారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా ఫ్లెక్సీలను తొలగించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ప్రచారానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

కదిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. వారు ఆదివారం మండలంలోని మేకల చెరువు గ్రామపంచాయతీలో ప్రచార చేపట్టగా మహిళలు అడుగడుగునా హారతులు పట్టి, పూలమాలలతో స్వాగతం పలికారు. మక్బూల్ మాట్లాడుతూ ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే జగన్ అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి వారి కళ్లల్లో కనబడుతోందన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైసిపిని మరోమారు గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు చేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. వారి వెంట వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు ఉన్నారు.

గ్రామాల్లో ప్రచారం చేస్తున్న వైసిపి అభ్యర్థులు మక్బూల్ అహ్మద్, బోయ శాంత

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బత్తలపల్లి : ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ శివశంకర్‌నాయక్ హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ పార్టీలకు సంబంధించి పోస్టర్లు, బ్యానర్లు, గోడలపై రాతలు ఉండకుండా చూసుకోవాల న్నారు. ఓటరు నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. త్వరలోనే ఓటర్ల కొత్త జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. వృద్ధులను సైతం పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓట్లు వేయించాలన్నారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు అన్నారు. రాజకీయ పార్టీల నేతలు మోడల్ కోడ్‌ను పాటించాలన్నారు. ప్రజలు ప్రయాణం చేసే సమయంలో రూ. 50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్ల వద్దన్నారు. రూ. 50 వేలకు కూడా ఆధారాలు ఉండాల్సిందే అన్నారు. ప్రభుత్వ భవనాలు, మసీదులు, చర్చిలు, దేవాలయాలల్లో ప్రచారం చేయకూడదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రాకణీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించారు.

ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు

హిందూపురం : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో 50 రోజుల పాటు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపడుతామని వైసిపి యువ నాయకులు మనోజ్ జూలియట్ తెలిపారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాల ఎదురుగా ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించి, మజ్జిగ ప్యాకెట్లు, మ్యాంగో జ్యూస్ పాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, అబ్రహం, సుమన్, శ్యామ్‌బాబు, పళనినగర్ శివ, చందన్, హనూక్, పండు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న మనోజ్ జూలియట్

తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జెసి అభిషేక్ కుమార్

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : జెసి

ప్రజాశక్తి-చిలమత్తూరు

హిందూపురం ఎన్నికల ఇన్‌ఛార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదివారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. కోడ్ అమలు నేపథ్యంలో కార్యాలయాలు నిత్యం తెరుచుకొని ఉండాలన్నారు. రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫొటోలను తక్షణమే తొలిగించాలని ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయం తెరవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలమత్తూరు–1 సచివాలయంపై ఉన్న జగన్, నవరత్నాలు చిత్రపటంపై రంగు వేయించాలని సూచించారు. వెంటనే కార్యదర్శి రామ్లానాయక్ రంగు వేయించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో మండిపడ్డారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి, చిలమత్తూరు–1 సచివాలయాన్ని సందర్శించారు.

'స్పందన' రద్దు : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : ఈ నెల 16 నుంచి జిల్లా అంతటా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే 'స్పందన'ను రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. ప్రజలు గమనించాలని సూచించారు.

ఆర్యవైశ్యుల రాజకీయ ఉన్నతికి వైసిపి పెద్దపీట

ఆత్మీయ సమావేశంలో కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలని, వారి అభ్యున్నతికి వైసిపి పెద్దపీట వేస్తోందని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. నియోజకవర్గంలోని ఆర్యవైశ్యుల 1,450 కుటుంబాలకు రూ. 21కోట్లు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం సాయం అందించిందన్నారు. జగన్ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవులు, చట్టసభల్లో పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో 3 అసెంబ్లీ స్థానాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత కేబినెట్లో వెల్లంపల్లి శ్రీనివాస్‌కు చోటు కల్పించారన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తారన్నారు. పట్టణానికి చెందిన వంకదారి భారతి రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్‌గా ఎంపికవడం హర్షణీయమన్నారు. నియోజకవర్గంలో పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమం అందిస్తున్న ఏకైక పార్టీ వైసిపి అన్నారు. ఆర్యవైశ్య పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ పట్టణంలో నీటి సమస్యను శాశ్వతంగా రూపుమాపి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డికి, వైసిపికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాగే ఆర్యవైశ్యులకు అండగా నిలవాలన్నారు. అనంతరం ఆర్యవైశ్యులంతా కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, కో ఆప్షన్ సభ్యుడు బూశెట్టి రామకృష్ణ, పెనుజూరు సుధాకర్, ఆర్వేటి కిషోర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కలవల మురళీధర్, వంకదారి వెంకటేశ్వర్లు, కలవల రామ్‌కుమార్, కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, వాసవీ క్లబ్ ఫౌండర్ కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, సుకుమార్‌గుప్తా, ఎంపిఆర్ గుప్తా, ఆయిల్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నల్లపేట ఆదినారాయణ, గర్లజ అశ్వర్థ, అంబటి శ్రీధర్, పిన్ను అశోక్, కిష్టం సాయిరమేష్, డాక్టర్ వేణుగోపాల్, రాగిణి, మంజుసంయుక్త, కలవల తేజ, అంబటి అవినాష్, రఘు పాల్గొన్నారు.

'పల్లె'ను కలిసిన ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు

పుట్టపర్తి రూరల్ : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని ఆదివారం పుట్టపర్తిలోని తన నివాసంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు పల్లెకు రానున్న 50 రోజులకి దిశా నిర్దేశం చేశారు. టిడిపి విజయం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, జరగబోయే కార్యక్రమాలని వివరించారు. ఎన్నికలకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పల్లె వివరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు శివరాజ్‌కుమార్, వింగ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్, నాగార్జున, మిట్టపల్లి హరికృష్ణనాయుడు, కోటి, దివాకర్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీ ప్రయాణం ఉచితం

ధర్మవరం టౌన్ : పదో తరగతి పరీక్షలు రాయడానికి వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ధర్మవరం డిపో మేనేజర్ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు బస్సులో హాల్ టికెట్ రూపించి ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థులను ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా, విద్యార్థుల నుంచి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో అర్హత కల్గిన ఆధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం జేఏసీ నాయకులు పెద్దన్న, భాస్కర్‌రెడ్డి, అక్బర్‌బాషా, శంకర్‌నాయక్, చంద్రకళ, సరిత ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ సిఫార్సుల మేరకు ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయడానికి 114 జీఓతో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి శాసనసభలో యాక్టును తొలగించింది. అర్హత కలిగిన అధ్యాపకులను యాక్ట్–30 ప్రకారం 2000 సంవత్సరం నుంచి 2012 వరకూ అర్హత ఉన్న వాళ్లందరినీ వెంటనే క్రమబద్ధీకరించి ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఎంపిడిఒ

ముదిగుబ్బ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలను అందరూ పాటించాలని, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ జిఎన్ఎస్ రెడ్డి తెలిపారు. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన రాజకీయ నాయకుల విగ్రహాలు ఆదివారం అధికారులు తాత్కాలికంగా ముసుగు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చెందిన పోస్టర్లు, నోటీసులను తొలగించారు. అన్ని పంచాయితీ కార్యాలయాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాల న్నారు. స్థానిక బస్సు షెల్టర్ వద్ద ఉన్న ఎన్టీఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగు వేశారు.

న్యాయవాదులు వైసిపిలో చేరిక

పెనుకొండ : పట్టణంలోని ఉషశ్రీచరణ్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర వైసిపి లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ డి.నాగరాజు ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు శివశర్మ శ్రీనివాసులు, వాల్మీకి శ్రీనివాసులు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైసిపిలోకి చేరారు. వారికి ఉషశ్రీచరణ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి లీగల్ టీమ్ ఆర్.నాగిరెడ్డి, బాలాజీ, పెనుకొండ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

పేరు మార్పు

నేను అనగా షేక్ సనావుల్లా తండ్రి పేరు లేట్ హుస్సేన్ సాబ్ (ఆధార్ నెంబరు3249 8033 8329) వయస్సు 58 సం॥లు ఇంటి నెంబరు 3-63/2 వినాయక నగర్, కొడిగేనహళ్లి (గ్రామం, పంచాయితీ) పరిగి మండలం, శ్రీ తస్యసాయి జిల్లా. నేను హెచ్‌డిఎఫ్‌సి స్టాండర్డ్ లైఫ్ ఇన్సురెన్స్‌లో పాలసీ నెంబరు 13997472 నా పేరులో తీసుకున్నాము. వాస్తవానికి నా పేరు ఆధార్, రేషన్ కార్డులో షేక్ సనావుల్లా. అయితే నేను తీసుకున్న పాలసీ ఖాతాలో నా పేరు షేక్ సనావుల్లాకు బదులుగా మిస్టర్ సమీవుల్ గా ఉంది. అందరు పిలిచేది, ఆధార్ రేషన్ కార్డులో ఉన్నది షేక్ సనావుల్లా.